సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 10 । మే । 2025




... మహిళా హాస్టల్ వార్డెన్ మృతి
సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా హాస్టల్ వార్డెన్ నాగమల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.



మన్నికైనవే ఎన్నుకోండి
ఆడేటప్పుడు, శిక్షణ పొందే సమయంలో క్రీడా పరికరాలు, దుస్తులు, బూట్లు వినియోగించకపోతే గాయపడే ప్రమాదముంటుంది.

12లో

9.55 అడుగులకు నీటి మట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం గోదావరి మిగులు జలాల విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీరు విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఎస్పీ బిందుమాధవ్



పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద నాకాబందీలో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్

తాళ్లరేవు: భారత్–పాకిస్థాన్ సరిహద్దులో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన నాకాబందీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం నేపథ్యంలో అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జనం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించాల్సిందిగా డీజీపీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి
– కలెక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అందరికీ ఇళ్లు పథకంలో నిరు పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో గృహ నిర్మాణాల పురోగతిపై వారితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గృహాల్లో 61 శాతం మాత్రమే పురోగతి సాధించారని మరో రెండు వారాల్లో 80శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎంవీ. నరసింహారావు, ఈఈలు, డీఈలు ఏఈలు పాల్గొన్నారు.

భూమి మార్కెట్ విలువకు ప్రతిపాదనలు చేయాలి

భూమి మార్కెట్ విలువలకు సంబంధించిన మరింత లోతైన విశ్లేషణ నిర్దిష్టమైన సిఫారసులతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రామచంద్రపురం పట్టణంలో భూముల మార్పిడి తదనంతరం భూములు విలువల నిర్ధారణ అంశాలపై ఉత్పన్నమైన అభ్యంతరాలపై జోనల్, ఉమ్మడి, జిల్లా రిజిస్ట్రార్లు, ఆర్డీవోతో కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూముల మార్పిడి తదనంతర వాణిజ్య నివాస భూములుగా నిర్ధారిస్తూ ప్రస్తుత మార్కెట్ విలువలను అంచనా వేయడానికి, వాటిని ప్రభావితం చేసే అంశాలను గుర్తించడానికి, విలువలను సవరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆర్డీవో డి.అఖిల, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ల విభాగం జోనల్ అధికారి ఎం.మాధవి, జిల్లా రిజిస్ట్రార్, మార్కెట్ విలువలు ఆడిట్ అధికారి జె.యుఎస్.జయలక్ష్మి, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు ఉంచాలి

నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా స్టాక్ యార్డుకు ఇసుకను తరలించాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ మహేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. వర్షాకాలంలో భవన నిర్మాణానికి అవసరమైన ఇసుక నిల్వలను స్టాక్‌యార్డుల్లో ఉంచాలని సూచించారు. ఆర్డీవోలు పీ. శ్రీకర్ డి అఖిల కే. మాధవి, గనులు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఎల్ వంశీధర్ రెడ్డి, జిల్లారవాణా. అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ 2024 పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి పి.సత్యరమేష్ తెలిపారు. టెట్‌లో అర్హత సాధించినవారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు అమలాపురంలో జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 70934 01225, 94404 03629 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎన్నేళ్లీ రెడ్ సిగ్నల్?

- కాకినాడ– కోటిపల్లి లైన్‌ను పట్టించుకోరా?
- రైల్వే ట్రాక్ మీదనే పిచ్చిమొక్కలు
- ధ్వంసమైన రైల్వే స్టేషన్‌లు
- గతంలో 45.30 కిమీల పొడవునా ట్రాక్ నిర్మాణం
- విద్యుద్దీకరణకు రూ.90 కోట్లు
- రెండు విడతలుగా రూ.30 కోట్ల కేటాయింపు
- పట్టాలెక్కని పనులు
- తొలి దశలో కాకినాడ నుంచి కోటిపల్లి ప్యాసింజర్
- తరువాత రైల్‌బస్సు రాకపోకలు
- గూడ్స్ నిర్వహణతో ఆదాయం
- ఆరు సంవత్సరాలుగా రాకపోకలు పూర్తిగా నిలిపివేత



కాకినాడ - కోటిపల్లి మధ్య తిరిగిన రైలు బస్సు



నిరుపయోగంగా మారిన కోటిపల్లి రైల్వేలైన్

సాక్షి, అమలాపురం: కోనసీమ ప్రజల చిరకాల వాంఛ కాకినాడ– నర్సాపురం రైల్వేలైన్. దీని నిర్మాణానికి 2004లో పునాది పడింది. 21 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయి. మొత్తం ప్రాజెక్టు పొడవు 102.507 కిలోమీటర్లు కాగా, కోటిపల్లి వరకు 45.30 వరకు పూర్తయ్యింది. బ్రిటిష్ కాలంలో 1928 నుంచి 1940 వరకు కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైన్ ఉండేది. తరువాత నిలిచిపోగా 2004లో తిరిగి మొదలైంది. తొలుత చెన్నై నుంచి కాకినాడ మధ్య తిరిగే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను కాకినాడ – కోటిపల్లి మధ్య ప్యాసింజర్‌గా తిప్పేవారు. ఇది భారీ నష్టాలు కలుగజేస్తోందని చెప్పి తరువాత రైలు బస్సును ప్రవేశపెట్టారు. ఇది చాలాకాలం సేవలందించింది. ఇది కూడా నష్టదాయకమని దీనిని కూడా నిలిపివేశారు. ఆరు సంవత్సరాలుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదే సమయంలో కోట్ల రూపాయల లాభాలు తెచ్చిపెట్టిన బియ్యం ఎగుమతులను కూడా నిలిపివేయడం గమనార్హం. కోటిపల్లి నుంచి వ్యాగన్ల ద్వారా ఇసుక కూడా ఎగుమతి అయ్యేది. గతంలో రామచంద్రపురం స్టేషన్ నుంచి బియ్యం ఎగుమతులు జోరుగా సాగేవి. నెలకు రూ.ఐదు కోట్ల వరకు ఆదాయం వచ్చేది. అయితే ఇతర ప్రాంతాల ఎగుమతిదారుల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా ఇక్కడకు రైల్వే అధికారులు గూడ్స్ రైలు పంపలేదనే విమర్శలున్నాయి.

ట్రాక్ మీద తుప్పలు... శిథిలమైన స్టేషన్‌లు



ధ్వంసమైన రైల్వే గేట్ భవనాలు

కాకినాడ– కోటిపల్లి మధ్య ఆరేళ్లుగా రైలు రాకపోకలు నిలిచిపోవడంతో రైల్వేట్రాక్, స్టేషన్‌లు ధ్వంసమవుతున్నాయి. రైల్వే ట్రాక్‌పై పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ట్రాక్ మీద వేసిన రాళ్లు చెల్లాచెదురయ్యాయి. రోడ్డు క్రాస్ చేసే చోట ఏర్పాటు చేసిన గేట్లు ఊడిపోయాయి. చిన్న చిన్న ఇనుప, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. స్టేషన్‌లు సైతం ధ్వంసమయ్యాయి. గుమ్మాలు, ఇతర వస్తువులు తరలించుకుపోయారు. భవనాల కిటికీలు కూడా ఊడిపోయాయి. స్టేషన్, ప్లాట్ ఫామ్‌ల మీద కూడా పిచ్చి మొక్కలు మొలిచాయి. ఈ రైల్వే లైన్‌లో అతి పెద్ద స్టేషన్ అయిన రామచంద్రపురం పరిస్థితి మరీ దారుణం. బహిరంగ మరుగుదొడ్లుగా మారిపోయింది. జిల్లా పరిధిలోకి వచ్చే కోటిపల్లి, దంగేరు, ద్రాక్షారామ, రామచంద్రపురం వంటి స్టేషన్‌లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.

కాకినాడ– కోటిపల్లి రైల్వేలైన్ విద్యుద్దీకరణకు నిధులు కేటాయించినా పనులు జరగడం లేదు. మొత్తం రూ.90 కోట్లు అయ్యే ఈ పనులకు 2023–24లో రూ.9 కోట్లు, 2024–25లో రూ.21 కోట్ల చొప్పున మొత్తం రూ.30 కోట్లు కేటాయించారు. కాని పనులు మొదలు కాలేదు. పాత రైల్వేలైన్ మరమ్మతులకు రూ.పది కోట్లు కేటాయించినా పనులు చేయడం లేదని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు. కనీసం ఉన్న రైల్వేలైన్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

చిట్టడవిలా కోటిపల్లి రైల్వే స్టేషన్



చిట్టడవిలా ఉన్న కోటిపల్లి రైల్వే స్టేషన్

అడవుల్లో రైల్వే స్టేషన్‌లను చూడడం కోనసీమ జిల్లా వాసులకు అరుదు. కాని కోటిపల్లి రైల్వే స్టేషన్, దాని పరిసరాలను చూస్తే అడవిలోని రైల్వే స్టేషన్ చూసినట్టు ఉంటోంది. ఒకప్పుడు కొబ్బరి, క్రోటన్ మొక్కలు.. స్టేషన్‌ను ఆనుకుని పచ్చని వరిచేలతో అందంగా ఉండే ఈ స్టేషన్ చుట్టూ ఏపుగా పెరిగిన వివిధ రకాల పిచ్చి మొక్కలతో ఇప్పుడు చిట్టడవిని తలపిస్తోంది.

నమ్మండి ఇది రైల్వే ప్లాట్ ఫామ్!



రామచంద్రపురం రైల్వే స్టేషన్‌లోని తుప్పలు, ముళ్ల పొదలతో నిండిపోయిన రైల్వే ప్లాట్ ఫామ్, రైల్వే ట్రాక్‌లు

తుప్పలు... ముళ్ల పొదలు మొలిచిన ఇది రైల్వే ట్రాక్, **రైల్వే ప్లాట్ ఫామ్ అంటే న**మ్మడం కష్టమే అయినా ఇది నిజం. కాకినాడ – నర్సాపురం రైల్వే ప్రాజెక్టు పరిధిలో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు గతంలో నిర్మించిన రైల్వే ట్రాక్ పరిస్థితి ఇది. ట్రాక్ మీద, ప్లాట్ ఫామ్ మీద పిచ్చి మొక్కలు మొలిచాయి. రామచంద్రపురంలో ఉన్న రైల్వే స్టేషన్ ధ్వంసమైంది. గతంలో ఇక్కడ నుంచి రైలు మీద కాకినాడకు, కోటిపల్లికి ప్రయాణికులు వెళ్లేవారు. రూ.కోట్ల విలువైన బియ్యం ఎగుమతి జరిగేది. ఈ స్టేషన్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కూడా ఉండేది. ఇప్పుడు రైల్వే రాకపోకలు లేక స్టేషన్ ఇలా శిథిలావస్థకు చేరింది.

ఇది రైళ్లు తిరగని రైల్వే ట్రాక్



తుప్పలతో నిండిపోయిన రైల్వే ట్రాక్

తుప్పలతో మూసుకుపోయిన ఇది రైళ్లు తిరగని రైల్వే ట్రాక్. కాకినాడ– కోటిపల్లి రైల్వే ట్రాక్ దుస్థితి ఇలా మారింది. ఇది రామచంద్రపురం– ద్రాక్షారామ రైల్వే స్టేషన్‌ల మధ్య చిన్న తాళ్లపొలం వద్ద రైల్వేగేట్ వద్ద పరిస్థితి. గతంలో రైళ్లు.. తరువాత రైలు బస్సు తిరిగిన ఈ ట్రాక్ మీద గత కొన్నేళ్లుగా రైళ్లు తిరగడం లేదు. దీనితో ఇలా తుప్పలతో నిండిపోయింది.

అమలాపురం వరకూ పూర్తి చేయాలి



కాకినాడ – నర్సాపురం రైల్వేలైన్‌లో గౌతమీ వంతెనకు సంబంధించి పియర్ల నిర్మాణం పూర్తయ్యింది. గెడ్డర్లకు టెండర్లు పూర్తి కావడంతో పనులు జరుగుతున్నాయి. వంతెన దాటిన తరువాత పది కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం పూర్తయితే అమలాపురం వరకు రైలు వచ్చే అవకాశముంది. దీనివల్ల రైల్వేకు ప్రయాణికుల ఆదాయం, గూడ్స్ ఆదాయం కూడా పెరుగుతుంది.

– బండారు రామ్మోహనరావు,కోనసీమ జేఏసీ కన్వీనర్, అమలాపురం

గూడ్స్ రైళ్ల ద్వారా ఆదాయం



ప్రయాణికుల కన్నా గూడ్స్ ద్వారా రైల్వేకు ఆదాయం వస్తోంది. ఈ విషయం రైల్వే గుర్తుంచుకోవాల్సి ఉంది. రామచంద్రపురం పరిసర ప్రాంతాల నుంచి కేరళకు బొండాల రకంతోపాటు పలు రకాల ధాన్యం దేశంలో పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. గూడ్స్ రాకపోకలు మొదలైతే రైల్వే ట్రాక్‌కు ఇప్పుడున్న దుస్థితి ఉండదు.

– కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, రామచంద్రపురం రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం

- 12 నుంచి 20 వరకూ నిర్వహణ
- జిల్లాలో 14,238 మంది విద్యార్థులు



సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

రాయవరం: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 12 నుంచి 20 వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఫస్టియర్ పరీక్షలను 30 పరీక్షా కేంద్రాల్లో . ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 17 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు.

14,238 విద్యార్థులు

ఫస్టియర్, సెకండియర్ కలిపి 14,238 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ ఏడాది ఫస్టియర్ విద్యార్థులు 10,519 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో బెటర్‌మెంట్ రాసే వారి సంఖ్య అధికంగా ఉంది. సెకండియర్ పరీక్షలకు 3,719 మంది హాజరు కానున్నారు. ఫస్టియర్, సెకండియర్ జనరల్ విద్యార్థులు 12,008 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,230 మంది పరీక్షలు రాయనున్నారు. 12 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, రెండు రెసిడెన్షియల్, 15 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు తప్పిన, బెటర్‌మెంట్ కట్టిన విద్యార్థులకు కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లను నియమించారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకోగా, పోలీస్ స్టేషన్లలో భద్రపర్చారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు.

రెండు సెషన్లలో

పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ప్రధాన పరీక్షలు 17వ తేదీ వరకు, 19, 20 తేదీల్లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ వంటి సబ్జెక్టులు నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి.

ప్రశ్నిస్తే ఎడిటర్‌కు వేధింపులా?

– సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు



అమలాపురం టౌన్: సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి, భూ కుంభకోణాల గురించి జర్నలిజం ద్వారా ప్రశ్నిస్తే పత్రికల ఎడిటర్‌ను వేధింపులకు గురి చేసేలా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని సీపీఎం జిల్లా కన్వీనర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. విజయవాడలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిలో ఏపీ పోలీసులు సోదాలు చేయడాన్ని, వేధింపులకు గురిచేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అమలాపురంలో వెంకటేశ్వరరావు మీడియాతో శుక్రవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా వాటిని ప్రశ్నిస్తున్న పత్రికల గొంతును నొక్కాలనుకోవడం అవివేకమని అన్నారు. పూర్తిగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర బలపడుతున్న తరుణంలో ఇలా జర్నలిస్టులు, ఎడిటర్‌లపై పోలీసులను ఉసిగొలిపి దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. ప్రజా స్వామ్య విలువలను తొంగలో తొక్కి, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో విస్తృత తనిఖీలు చేసిన పోలీసులకు ఏమీ దొరకలేదంటేనే ఇది పూర్తిగా కక్ష సాధింపు కోసం చేసిన కుట్రేనని తేటతెల్లమవుతోందన్నారు. పత్రికలు వెలుగులోకి తెచ్చే అక్రమాలు, అవినీతి వార్తలను ప్రభుత్వం సలహాలుగా స్వీకరించాలే తప్ప ఇలా దాడులకు, వేధింపులకు పాల్పడం సరికాదన్నారు. ప్రభుత్వం అంటే ఎన్నికల వరకే పరిమితం కావాలి. అధికారం చేపట్టాక అందర్నీ, అన్ని వర్గాలను సమానంగా చూసినప్పుడే అది ప్రజారంజక ప్రభుత్వం అనే భావన కలుగుతుందన్నారు. జర్నలిజంపై దాడులు, కుట్రలు చేస్తే ప్రజా సంఘాలు చూస్తూ ఊరుకునేది లేదిన స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఆందోళనలు చేపట్టే పరిస్థితిని తెచ్చుకోవద్దని హితవు పలికారు.

వ్యర్థానికి కట్టలతో అర్థం

- యంత్రాలతో కోసిన పశుగ్రాసానికి పెరుగుతున్న క్రేజ్
- ఎండు గడ్డిని కట్టలుగా కట్టి వినియోగిస్తున్న రైతులు



ఎండుగడ్డిని ట్రాక్టర్లపై తరలిస్తున్న రైతులు

రాయవరం: యంత్రాలతో కోసిన వరిగడ్డిని గతంలో చేలల్లోనే వదిలి వేసేవారు. రైతులు వ్యర్థంగా భావించిన గడ్డిని తగులబెట్టేవారు. అయితే ఇటీవల కాలంలో యంత్రాలతో కోసిన గడ్డిని కట్టలుగా కట్టి పశుగ్రాసంగా వాడుతున్నారు. ఇప్పుడు 98 శాతం మంది రైతులు యంత్రాలతో వరికోతలు కోస్తున్నారు. దీంతో పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన గడ్డిని కట్టలుగా కట్టి, పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. సాగులో భూమిని దమ్ము చేయడం నుంచి నాట్లు వేయడం, పురుగుమందుల పిచికారీ, పంట మాసూళ్ల వరకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వరి కోత యంత్రాలతో కోసిన పొలాల్లో ఉన్న గడ్డిని కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు.

తీరుతున్న ఎండుగడ్డి కొరత

దాళ్వా సీజన్లో పంట మాసూళ్లకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. యంత్రంతో పంట మాసూళ్ల చేయడం వల్ల వరి గడ్డి.. ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. గతంలో ముక్కలుగా మారిన గడ్డిని పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు గడ్డిని చేలల్లోనే తగులబెట్టేవారు. దీంతో పాడి రైతులు పశువులకు మేతగా ఉపయోగించే ఎండుగడ్డికి కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గడ్డి కొరత కారణంగా ఎకరం గడ్డి సుమారు రూ.6,000 నుంచి రూ.8,000 వరకు ధర పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు వరి కోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డి పశువులకు ఉపయోగంగా ఉంటుందని, ముక్కలైన గడ్డి పశువులు తినడం వల్ల త్వరగా జీర్ణమవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు యంత్రాల ద్వారా మాసూలు చేసిన వరి పంట గడ్డిని పశువులకు మేతగా ఉపయోగించడాన్ని అలవాటు చేసుకున్నారు. సాధారణ వరికోతలు కోసిన ఎండు గడ్డికి, యంత్రాలతో కోసిన ఎండు గడ్డికి మధ్య పోషకాల్లో ఎటువంటి తేడా ఉండదని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 2.29 లక్షల పశు సంతతి ఉంది. వీటిలో 75,460 ఆవులు, 1,53,542 గేదెలు ఉన్నాయి. పశువులు కూడా ఇష్టంగా తినడంతో వరి కోత యంత్రాల ద్వారా మాసూలు చేసిన వరి గడ్డిని దాణాగా ఉపయోగిస్తున్నారు. గడ్డి కట్టలు కట్టడానికి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఇక్కడ ఉన్న యంత్రాలతో పాటుగా, ఇతర జిల్లాల నుంచి యంత్రాలు మన ప్రాంతానికి వస్తున్నాయి. గడ్డిని ప్రత్యేక యంత్రం ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్లతో గట్టుకు చేర్చి గడ్డివాములుగా వేస్తున్నారు. యంత్రం ద్వారా కట్టలు కట్టడానికి ఒక్కో కట్టకు 35 రూపాయలు వసూలు చేస్తున్నారు. దీనికితోడు రవాణా, కూలి ఖర్చులు తోడవుతున్నాయి. దీంతో యంత్రం ద్వారా ఎకరం గడ్డి కట్టలు కట్టించడానికి సుమారు రూ.2,000 వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు.

పశువులు ఇష్టంగా తింటున్నాయి



వరికోత యంత్రాలతో కోసిన గడ్డిని పశువులు ఇష్టంగా తింటున్నాయి. యంత్రాలతో వరికోతలు అధికంగా ఉండడంతో ఆ గడ్డినే వినియోగిస్తున్నాం. యంత్రాలతో కట్టలు కట్టించి, గడ్డివాములుగా వేస్తున్నాం.

– నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, పాడి రైతు, పసలపూడి, రాయవరం మండలం

కొరతను అధిగమిస్తున్నారు

యంత్రాలతో కోసిన ఎండు గడ్డిని కట్టలుగా కట్టి వాటిని రైతులు పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు. గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాల వినియోగం పెరగడంతో ఎండు గడ్డి కొరతను అధిగమిస్తున్నారు. గడ్డిని కట్టలు కట్టే యంత్రాలు రావడంతో ఎండు గడ్డి వృథా తగ్గింది. రవాణా, వినియోగం సులువుగా మారింది.

– ఎ.నాగశ్రావణి, మండల పశువైద్యాధికారి, రాయవరం మండలం.



పొలాల్లో కట్టలుగా కట్టిన ఎండుగడ్డి

వేదాంత పరిశ్రమలో మాక్‌డ్రిల్



వేదాంత పరిశ్రమ ఎదుట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్

ఉప్పలగుప్తం: భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ జరుగుతున్న క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని ఎస్.యానాం గ్రామంలో ఓఎన్‌జీసీ అనుబంధ పరిశ్రమ అయిన వేదాంత పరిశ్రమలో పోలీసు, రెవెన్యూ , మెరైన్, వేదాంత కంపెనీ అధికారుల మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. సంఘ విద్రోహ చర్యలు జరుగుతున్న క్రమంలో ఉద్యోగులు, శ్రామికులు వాటి నుంచి ఏవిధంగా బయట పడాలో శుక్రవారం మాక్ డ్రిల్‌లో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి అనే విషయాలపై పరిసర గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, ఇతర శాఖల సమన్వయంతో చేపట్టే చర్యలను వివరించారు. ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఓడలరేవు మెరైన్ సీఐ ఎమ్.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఐ సీహెచ్ రాజేష్, రెవెన్యూ, వేదాంత పరిశ్రమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్నికైనవే ఎన్నుకోండి

- ఆటలు ఆడుతున్నారా? తస్మాత్ జాగ్రత్త
- రక్షణ కవచాలు లేకుంటే గాయాల పాలే..
- నాసికరం కొన్నారంటే...మూన్నాళ్లే!

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటలు అంటే అందరికీ ఇష్టమే. ఆరేళ్ల వయస్సు నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలు వివిధ రకాలైన ఆటలు ఆడడానికి ఉత్సాహం చూపుతారు. ఆసక్తి, అభిరుచి ఉన్న ఆటల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని కలలు కంటారు. వేసవి సెలవులు ఇవ్వడంతో జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ రకాల వేసవి శిక్షణ శిబిరాల్లో చేరేందుకు బాలబాలికలు ఆసక్తి కనపరుస్తున్నారు. క్రీడలకు సంబంధించి ఆడేటప్పుడు లేదా శిక్షణ పొందే సమయంలో క్రీడాపరికరాలు, దుస్తులు, బూట్లు వినియోగించకపోతే గాయాలపాలై ఒక్కోసారి క్రీడలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. వివిధ రకాల క్రీడల్లో వినియోగించే వస్తువులు, క్రీడాపరికరాలు, వాటి ధరలపై కథనం


క్రీడాపరికరాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం


కాకినాడలోని స్పోర్ట్స్ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వివిధ క్రీడా పరికరాలు

బాస్కెట్‌బాల్
టీ షర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. బాస్కెట్‌బాల్స్ రూ.750 నుంచి రూ.2,500 వరకు, డ్రస్ రూ.900 నుంచి రూ.3,000, షూ రూ.1,500 నుంచి రూ.8,000, నెట్ రూ.400 నుంచి రూ.5,000 వరకు ఉన్నాయి.

క్యారమ్స్
క్యారమ్ బోర్డులు చిన్నవి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు, పెద్దవి రూ.1,200 నుంచి రూ.15వేల వరకు, క్వాయిన్స్ రూ.100 నుంచి రూ.500 వరకు, స్ట్రైకర్స్ రూ.50 నుంచి రూ.500 వరకు, స్టాండ్ రూ.2,000, పౌడర్ రూ.40 నుంచి అందుబాటులో ఉన్నాయి.


క్యారమ్ బోర్డు

చెస్
చెస్ బోర్డ్స్ రూ.200 నుంచి రూ.2,000 వరకు, పాన్స్ రూ.100 నుంచి రూ.1,000 వరకు, టైమర్ రూ.2,000 నుంచి రూ.10,000, చెస్ మ్యాట్ రూ.100 నుంచి రూ.500 వరకు ఉన్నాయి.


చెస్ బోర్డు, పాన్స్


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వివిధ కంపెనీల క్రికెట్ బ్యాట్స్

క్రికెట్
క్రికెట్‌లో హెల్మెట్, గ్లౌజ్, ప్యాడ్స్, ఆర్మ్‌గార్డ్, థైగార్డ్, క్రికెట్ బ్యాట్స్ వినియోగిస్తారు. కాస్ట్ బ్యాట్ రూ.1,800 నుంచి రూ.3,500, ఇంగ్లిష్ బ్యాట్ రూ.3,500 నుంచి రూ.60 వేల వరకు, బాల్స్ రూ.200 నుంచి రూ.250 వరకు, మ్యాచ్ బాల్స్ రూ.450 నుంచి రూ.900 వరకు, డ్రస్ రూ.650 నుంచి రూ.3 వేల వరకు, వికెట్స్, ప్యాడ్స్ రూ.1,200 నుంచి రూ.1,500 వరకు, కిట్ బ్యాగ్ రూ.800 నుంచి రూ.15 వేల వరకు, హెల్మెట్ రూ.1,100 నుంచి రూ.9 వేల వరకు ఉన్నాయి.

హాకీ
రూ.650 నుంచి రూ.5,000 వరకు, నెట్ రూ.25,000, గోల్‌కీపర్ కిట్ రూ.10,000 నుంచి రూ.25,000 వరకు ఉన్నాయి. ఇందులో హెల్మెట్, చెస్ట్‌ప్యాడ్, బాడీ ప్రొటెక్షన్, గ్లౌజ్, ప్యాడ్, నీగార్డ్స్, ఎల్‌బోగార్డ్స్‌ను వినియోగిస్తారు.

బ్యాడ్మింటన్
బ్యాడ్మింటన్‌లో రిస్ట్‌బ్యాన్స్, నీక్యాప్స్, షూ, టీ షర్ట్, షార్ట్స్ వినియోగిస్తారు. ఫెదర్ కాక్స్ కొరత కారణంగా ఎక్కువ కాలం మన్నిక కోసం నైలాన్ కాక్స్ ఉపయోగిస్తున్నారు. బ్యాట్స్ రూ.650 నుంచి రూ.15,000 వరకు, నెట్స్ రూ.350 నుంచి రూ.3,000 వరకు, కాక్స్ బ్యారర్ రూ.300 నుంచి రూ.4,000 వరకు అమ్ముతున్నారు.

హ్యాండ్‌బాల్
హ్యాండ్‌బాల్‌లో టీషర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. బాల్స్ రూ.700 నుంచి రూ.5,000 వరకు, నెట్స్ రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఉన్నాయి.


వివిధ కంపెనీల ఫుట్‌బాల్స్, వాలీబాల్స్

ఫుట్‌బాల్
ఫుట్‌బాల్‌లో చిన్‌గార్డ్స్ వినియోగిస్తారు. బాల్స్ రూ.800 నుంచి రూ.2,500 వరకు, నెట్స్ రూ.500 నుంచి రూ.15,000 వరకు ఉన్నాయి. డ్రస్ రూ.800 నుంచి రూ.1,500 వరకు అందుబాటులో ఉంది.

వాలీబాల్
బాల్స్ రూ.600 నుంచి రూ.1,800 వరకు, నెట్ రూ.400 నుంచి రూ.5,000 వరకు, డ్రస్ రూ.800 నుంచి రూ.8,000 వరకు ఉన్నాయి.

టేబుల్ టెన్నిస్
టీటీ బ్యాట్స్ రూ.400 నుంచి రూ.5,000 వరకు, బాల్స్ రూ.30 నుంచి రూ.250 వరకు ఉన్నాయి. టీటీ బోర్డ్స్ రూ.25,000 నుంచి రూ.80,000 వేలు వరకు దొరుకుతున్నాయి.



టెన్నిస్ బ్యాట్, బాల్స్

త్రోబాల్
బాల్స్ రూ.700 నుంచి రూ.1,500 వరకు, నెట్ రూ.600 నుంచి రూ.2,500 వరకు ఉన్నాయి. ఈ ఆటలో షార్ట్, టీ షర్ట్, షూ వినియోగిస్తారు.

స్కేటింగ్
స్కేట్స్, హెడ్‌గార్డ్, ఎల్‌బో గార్డ్, నీగార్డ్స్, షూ, స్కేటింగ్ డ్రస్ వినియోగిస్తారు. స్కేటింగ్ షూ రూ.400 నుంచి రూ.10,000, డ్రస్ రూ.500 నుంచి రూ.5,000 వరకు, ప్రొటెక్షన్ కిట్ రూ.400 నుంచి రూ.4,000 వరకు ఉన్నాయి.

టెన్నిస్
ర్యాకెట్‌లు రూ.1,500 నుంచి రూ.15,000 వరకు, బాల్స్ రూ.500 నుంచి రూ.1,200 వరకు ఉన్నాయి.

తైక్వాండో..
తైక్వాండో డ్రస్ రూ.500 నుంచి రూ.1,200 వరకు ఉన్నాయి.

బాల్ బ్యాడ్మింటన్
బ్యాట్స్ రూ.500 నుంచి రూ.5,000 వరకు, బాల్స్ రూ.60 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు.

షాట్‌పుట్
8ఎల్‌బీ, 16ఎల్‌బీ, 12ఎల్‌బీబీ రూ.1000 నుంచి రూ.2,000 వరకు ఉన్నాయి.

స్విమ్మింగ్
క్యాప్స్, గాగుల్స్, ఇయర్ ప్లగ్స్ డ్రస్ వినియోగిస్తారు. స్విమ్ సూట్స్ రూ.100 నుంచి రూ.2,000 వరకు, గాగుల్స్ రూ.150 నుంచి రూ.5,000 వరకు, షార్ట్స్ రూ.250 నుంచి రూ.2,000 వరకు ఉన్నాయి.

స్పోర్ట్స్ షూ
స్పోర్ట్స్ షూ రూ.600 నుంచి రూ.10,000 ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

క్రీడా పరికరాల కొనుగోలులో తీసుకోవల్సిన జాగ్రత్తలు
క్రీడాపరికరాలు ఆథరైజ్డ్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాలి. నాసిరకం కంపెనీలు, డూప్లికేట్ కంపెనీ వస్తువుల పట్ల అప్రమత్తత కలిగి ఉండాలి. క్రీడా పరికరాలు తయారు చేసి ఎక్కువ సంవత్సరాలు కానివి కొనుగోలు చేయాలి. క్రికెట్, షటిల్, టెన్నిస్ బ్యాట్స్ కొనుగోలులో హ్యాండిల్స్, పగుళ్లు, ఫ్రేమ్ క్రాక్స్ లేకుండా చూసుకోవాలి. నెట్ నాణ్యత కలిగినది కొనుగోలు చేయాలి. తక్కువకు వస్తున్నాయని డూప్లికేట్ కంపెనీలు కొనుగోలు చేస్తే మూన్నాళ్లకే మూలకు చేరడం ఖాయం.

భవిష్యత్‌లో చైనా టెక్నాలజీతో విగ్రహాలు

- సెమినార్‌లో పాల్గొన్న శిల్పి రాజ్‌కుమార్
- తయారీలో కొత్త పోకడలపై అధ్యయనం

కొత్తపేట: చైనా టెక్నాలజీని భవిష్యత్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆ తరహా విగ్రహాలు రూపకల్పనపై దృష్టి సారించనున్నట్టు అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి రాజ్‌కుమార్‌వుడయార్ తెలిపారు. చైనాలో నూతన టెక్నాలజీతో విగ్రహాల తయారీపై జరిగిన సెమినార్‌లో రాష్ట్రం నుంచి ఆయన పాల్గొన్నారు. శుక్రవారం ఆ సెమినార్ విశేషాలను వివరించారు. వారం రోజుల పాటు సాగిన సెమినార్‌లో 250 దేశాల నుంచి వివిధ రకాల విగ్రహాల శిల్పులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కాంస్యంతో విగ్రహాలు తయారు చేస్తున్నామని, అక్కడ వీటితో పాటు ఇంకా అనేక రకాల లోహాలతో విగ్రహాలు తయారు చేస్తున్నారని తెలిపారు. భారీ కాంస్య విగ్రహాలను నిర్మించడంలో చైనా కంపెనీలకు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. సంప్రదాయ క్యాస్టింగ్ పద్ధతులకు ఆధునిక టెక్నాలజీని కలిపి భారీ స్థాయి విగ్రహాలను చైనా కంపెనీలు తయారు చేస్తున్నాయని, అత్యంత ఎత్తైన విగ్రహాలు కూడా ఆ దేశం టెక్నాలజీ ద్వారానే తయారవుతున్నాయన్నారు.


చైనాలో విగ్రహాల తయారీ నిపుణులతో శిల్పి రాజ్‌కుమార్

ముందు చిన్న నమూనా విగ్రహం తయారుచేసి, దానిని 3 డీ స్కానింగ్ చేసి, కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా కోరుకున్న సైజుకు ఇమేజ్‌ను పెంచుతారని తెలిపారు. ఎత్తైన విగ్రహాల విడి భాగాలను సులభంగా పోత పోసేందుకు ఫౌండ్రీలు ఉన్నాయని తెలిపారు. పెద్ద పెద్ద ఫౌండ్రీల వల్ల తక్కువ సమయంలో విడి భాగాలను తయారు చేసే వీలు ఉంటుందన్నారు. భారీ విగ్రహాలు నెలకొల్పే విషయంలో వివిధ దేశాలు, రాష్ట్రాలు చైనా కంపెనీల వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. విగ్రహాలే కాక పార్కులు, సాంస్కృతిక చిహ్నాలు, వివిధ కళాకృతులు నిర్మిస్తారని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కరప: మండలం గొర్రిపూడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఒకవ్యక్తి మృతి చెందాడు. గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్యనూకరాజు(69)కి మతిస్థిమితం సరిగా ఉండదు. అప్పుడప్పుడూ ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చేస్తుండేవాడు. ఈ క్రమంలో నూకరాజు ఈ నెల 8వ తేదీన రాత్రి 7 గంటలకు బయటకు వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అదే గ్రామానికి చెందిన ఒంటి వీరగణేష్ నూకరాజు కొడుకుకు ఫోన్ చేసి నూకరాజు రోడ్డుపక్కన చనిపోయి ఉన్నాడని చెప్పాడు.

మృతుని కుమారుడు ఘటనా స్థలానికి వెళ్లి, తన తండ్రి నూకరాజును ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి, వెళ్లిపోయిందని కరప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, కరప ఎస్‌ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒత్తిడిలో విద్యారంగం


డీఆర్‌ఓ రాజకుమారికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆందోళన

అమలాపురం రూరల్: ప్రభుత్వ విధానాల వల్ల విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందని, దశాబ్దాల నుంచి అములులో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం ఏర్పడుతోందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడిమి రామచంద్రం ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థానంలో ఒకటి, రెండు తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పథక రచన చేస్తోందన్నారు. ఒక్కొక్క రకమైన పాఠశాలలో ఒక్కొక్క విధంగా విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తులు ఉండాలని సూచిందన్నారు ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలలలో శాస్త్రీయమైన రీతిలో సబ్జెక్టు టీచర్లను నియమించాలని కోరారు. ఈ మేరకు డీఆర్‌ఓ రాజకుమారికి వినతి పత్రం అందించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, డీఏలు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మూడు దశల పోరాట కార్యక్రమానికి పిలుపు ఇచ్చిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ నిరాజ్, జిల్లా నాయకులు నక్కా లల్లీ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళా హాస్టల్ వార్డెన్ మృతి

- పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన


పెద్దాపురంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, ప్రజాసంఘాలు


నాగమల్లి (ఫైల్)


పెద్దాపురం: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంంంంజినీరింగ్ కళాశాలలో మహిళా హాస్టల్ వార్డెన్ నిండుకుండల నాగమల్లి (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రౌతులపూడి మండలం మెరక సోమవారనికి చెందిన ఈమె ఏడాదిగా హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడటంతో కళాశాల సిబ్బంది పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి తల్లితండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించి యాజమాన్యం తప్పిందం వల్లే ఈ ఘటన జరిగిందని ఆత్మహత్య కాదు హత్యేనంటూ నినాదాలు చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయలంటూ డిమాండ్ చేస్తూ మెరక సోమవరం గ్రామస్తులు, ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అక్కడకు చేరుకుని పూర్తిన్యాయం చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మనస్థాపంతోనే యువతి ఆత్మహత్య

గండేపల్లి: మనస్థాపంతోనే ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆమె తన గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివ దుర్గను ప్రేమించిందన్నారు. శివ దుర్గ ఆమెను వివాహం చేసుకునేందుకు నిరాకరించడంతో మనస్థాపాం చెంది ఆమె ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలి తల్లి దేవుడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాళ్లరేవు: యానాం- ద్రాక్షారామ రహదారిలో సుంకరపాలెంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మడికి సత్యనారాయణ(69) మృతిచెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మడికి సత్యపారాయణ రహదారి చెంతన ఉన్న కుళాయి వద్దకు నీరు పట్టుకునేందుకు రాగా ఆ సమయంలో ద్రాక్షారామ నుంచి యానాం వేగంగా వెళుతున్న వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.


సత్యనారాయణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కిక్ బాక్సర్‌కు ఎస్పీ అభినందన


లేఖా నిహారికను అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న కాకినాడ నగరానికి చెందిన యువతి లేఖా నిహారికను ఎస్పీ బిందు మాధవ్ శుక్రవారం ఆయన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేఖా నిహారిక కేరళలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ శిక్షణలో రాణించి హంగేరియన్ వాకో వరల్డ్ కప్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని అన్నారు. ఈ పోటీలలో ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ముమ్మిడివరం: మండల పరిధిలోని అన్నంపల్లి పంచాయతీ లక్ష్మీదేవిలంకలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కడలి పద్మావతి బుధవారం బంధువుల ఇంటికి వెళ్లారు.

ఈ నేపథ్యంలో పద్మావతి ఇంటి వద్ద పెట్టిన వాహనాన్ని తీసుకునేందుకు ఆమె మరిది హేమరాజు వెళ్లగా ఇంటి తాళాలు తెరిచి ఉండడంతోపాటు ఇంటి వెనుక ఉన్న తలుపులు కూడా తెరచి ఉన్నాయి. ఈ విషయాన్ని పద్మావతికి తెలుపగా ఆమె వచ్చి చూడగా బీరువా తాళాలు పెకిలించి ఉండడాన్ని గుర్తించారు. 55 గ్రాముల బంగారం, 39 తులాల వెండి, రూ.20 వేల నగదు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎం.మోహన్‌కుమార్ సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.